క్లుప్తంగా

మౌలిక వసతులు ఏర్పాటుచేయండి

ఫిరంగిపురం: మండలంలోని అల్లంవారిపాలెంలో డ్రైనేజీ, తాగునీటి, రోడ్ల సమస్యలను అధికారులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. అల్లంవారిపాలెంలోని చెరువు, రోడ్లను సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు కాలువల్లో నీటి పారుదల సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామంలో ప్రధాన రోడ్లు పూర్తిగా గుంతలు పడిపోవడంతో వర్షం కురిస్తే నడిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు సరిగాలేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని చెరువు కట్టకు కాలువకు మధ్య సైడు వాల్ కూడా నిర్మించాలని సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి ఉన్నారు.

కేఎల్‌యూకు ఆలిండియా 4వ ర్యాంకు

తాడేపల్లి రూరల్: ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) 2025కు సంబంధించి ప్రకటించిన ర్యాంకుల్లో గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ఆలిండియా 4వ ర్యాంకును సొంతం చేసుకున్నట్లు వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ ఎ. శ్రీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17 నుంచి 19 వరకు సిమ్లాలో జరిగిన ఏఐసీటీఈ ఎడ్యుస్కిల్ అవార్డులు 2025 సదస్సులో ఏఐసీటీఈ ప్రతినిధులు ఈ అవార్డును ప్రకటించారని తెలిపారు. వడ్డేశ్వరం కేఎల్‌యూ సౌత్ సెంట్రల్ జోన్‌లో ఉత్తమ పనితీరు కనబరిచే విశ్వవిద్యాలయంగా అఖిల భారత ర్యాంకు అవార్డులు 2025, కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ సౌత్ సెంట్రల్ జోన్‌లో ఉత్తమ పనితీరు కనపరిచే విశ్వవిద్యాలయాలుగా అవార్డులను సాధించామని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఎక్సలెన్స్ అవార్డును ఆచార్యులు ఆకెళ్ళ రామకృష్ణకు, ఎడ్యుస్కిల్ సేవా అవార్డును డాక్టర్ పి.వి. వరప్రసాద్‌ను వరించాయని తెలిపారు.

వీఆర్వోల సమస్యలు తీర్చాలని వినతి

మేడికొండూరు: వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలన సంఘ నేతలు కోరారు. గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాని శుక్రవారం ఏపీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ వీఆర్వోల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వోలు ఎదుర్కొంటున్న పదోన్నతి సమస్యలపై కీలకమైన అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్న కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బూర్దురాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మంగళగిరి టౌన్: వ్యక్తి అదృశ్యంపై శుక్రవారం మంగళగిరి పీఎస్‌లో కేసు నమోదైంది. మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాలచెరువు ప్రాంతంలో నివసిస్తున్న తోకల బాలాజీ ఈనెల 15వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని తల్లి రాజ్యలక్ష్మి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలాజీ వయస్సు 33 ఏళ్లని, వివాహమైన కొంత కాలానికే భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చి విడాకులు తీసుకున్నారు. బాలాజీ ఆమె వద్దే ఉంటున్నాడు. మూడు నెలలుగా తాడేపల్లిలోని ఓ పాలకేంద్రంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో 15వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో డ్యూటీకి అని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. పలుచోట్ల వెదికినా ఫలితం లేదు. ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో లైట్ బిస్కెట్ రంగు చొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని రాజ్యలక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది.

సమన్వయంతో బూత్ కమిటీల నియామకం

వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్)



మాట్లాడుతున్న వజ్రబాబు, ఇతర నాయకులు

తాడికొండ: నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో బూత్ కమిటీల నియామకం త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్) సూచించారు. శుక్రవారం గుంటూరు మల్లికార్జునపేటలోని నియోజకవర్గ కార్యాలయంలో బూత్ కమిటీల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షులు ఉడుముల పిచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, గ్రామ పార్టీ అధ్యక్షులతో పాటు అనుబంధ విభాగాల నాయకులు అందరి సమన్వయంతో గ్రామాల్లో పార్టీకి చురుగ్గా పనిచేసే వ్యక్తులను బూత్ కమిటీలుగా నియామకం చేసి వెంటనే భర్తీ చేయాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో బూత్ కమిటీల పాత్ర కీలకమని, కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యమిస్తూ గ్రామ, మండల స్థాయిలో ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో 4 మండలాల బూత్ కమిటీ అధ్యక్షులు చావలి రంజిత్, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, బిళ్ళా లూర్థయ్య, దానబోయిన వెంకటేశ్వరరావు, కాకి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొరప్రాడు విద్యార్థులు



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

మేడికొండూరు: పల్నాడు జిల్లా నందిగామలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఫుట్‌బాల్ ఎంపిక పోటీలలో కొరప్రాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి ఐదుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కడియం జయరావు మాట్లాడుతూ బాలుర విభాగంలో చరణ్, నవీన్ ఎంపికవ్వగా, బాలికల విభాగంలో పూజిత, సాహితీ, దివ్య జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారు. వీరంతా త్వరలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోట వెంకట శివ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి మన విద్యార్థులు ఎంపికవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. వారిని పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, జయలక్ష్మి, అమల, శివనాగమణి, రాధ, సౌజన్య, ప్రకాష్ బాబు, వెంకటేశ్వర్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మనస్తాపంతో బలవన్మరణం

మంగళగిరి టౌన్: మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. ఘటనపై వ్యక్తి తల్లి వెంకట సుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మంగళగిరి భద్రావతి నగర్‌లో నివసిస్తున్న వెంకట సుబ్బమ్మకు ఇద్దరు పిల్లలు. కుమారుడు లోకేష్ గత 15 సంవత్సరాలుగా బంగారపు పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం విజయవాడకు చెందిన అమ్మాయితో వివాహం జరిగింది. వీరిద్దరికి సంతానం లేకపోవడంతో విజయవాడలోని ఓ హాస్పిటల్‌లో మందులు వాడుతున్నారు. సుమారు 8 నెలల క్రితం పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పిన కోడలు తిరిగి రాలేదు. పలుమార్లు లోకేష్‌తో కలసి అతని తల్లి.. కోడలు ఇంటికి వెళ్లి కాపురానికి రావాలని అడిగారు. కొన్ని రోజులు ఉండి వస్తానని కోడలు చెప్పింది. ఈనెల 18వ తేదీ గురువారం రోజూలాగా బంగారపు షాపునకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి లోకేష్ ఇంటికి వచ్చాడు. తర్వాత షాపునకు వెళ్లిన అతను సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికొచ్చి మేడమీదకు వెళ్లాడు. కాసేపటికి కిందకు వచ్చి వాంతులు అయ్యేలా ఉందని చెప్పి తల్లిని పట్టుకుని వాంతులు చేసుకుని అక్కడికక్కడే కిందపడిపోయాడు. ఎంతసేపటికీ మాట్లాడలేదు. ఇంతలోనే అమె అల్లుడు ఇంటికి రాగా లోకేష్‌ను చికిత్స నిమిత్తం ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. తన కొడుకు లోకేష్ మనస్తాపం చెంది విషపదార్థాం తీసుకుని బలవన్మరణం చేసుకున్నాడని అతని తల్లి ఫిర్యాదులో పేర్కొంది. కొడుకు మరణించిన విషయం కోడలు తండ్రి శ్రీహరికి తెలియజేసినా ఎటువంటి సమాధానం రాలేదని ఫిర్యాదులో పేర్కొంది. పట్టణ పోలీసులు లోకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు శక్తియాప్‌పై అవగాహన

తాడేపల్లి రూరల్: ఉండవల్లి సెంటర్ వంశీ టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు శక్తి యాప్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు, యువతులు శక్తియాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి? ఎలా ఉపయోగించుకోవాలనే అనే విషయాలను వివరించారు. మహిళా సమస్యలను పోలీసుల దృష్టికి ఎలా తీసుకురావాలి? వారి నుంచి ఎలా ఎలాంటి రక్షణ పొందవచ్చు అనే వివరాలు తెలియజేశారు. సైబర్ నేరాల వలలో పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పోలీసు సిబ్బంది సమాధానాలు ఇచ్చారు. గతంలో పోలీస్ టోల్‌ఫ్రీ నంబర్ 100 ఉండేదని ఇప్పుడు దానిని 112గా మార్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు బి.లలిత, ఎన్.నాగలక్ష్మి, పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్‌కు రేవేంద్రపాడు విద్యార్థి



దుగ్గిరాల: రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు రేవేంద్రపాడు విద్యార్థి టి. చంద్రశేఖర్ ఎంపిక కావడంతో హెచ్‌ఎం కృష్ణారావు అభినందనలు తెలిపారు. శుక్రవారం హెచ్.ఎం మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో బాపట్ల జిల్లా ముత్తాయిపాలెంలో నిర్వహించిన అండర్ 14 బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలో విజయం సాధించాడని తెలిపారు. అక్టోబరు 6 న జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ రాంబాబు, శిరీష, ఉపాధ్యాయులు శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

తాడేపల్లి రూరల్: మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని వైద్యులు సూచించారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలుప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. సీతానగరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శాంతకుమారి, వైద్యులు డాక్టర్ అనూష, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య ముద్ర, నాయకులు దాసరి కృష్ణ, గాదె బసివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో..

కుంచనపల్లిలో ఆయుష్మాన్ భారత్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర వైద్య పరీక్షలు చేశారు.

పేదలకు రెండు సెంట్లు ఇవ్వండి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పోలకంపాడు గుంటూరు చానల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద, సీతానగరం పుష్కర కాలనీలో నివాసముంటున్న పేదలకు ఉన్నచోటే రెండు సెంట్ల స్థలాలు ఇచ్చి రెగ్యులరైజేషన్ చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ 2016 పుష్కరాల సందర్భంగా సీతానగరంలో ఇల్లు తొలగించిన పేదలకు స్థలాలు ఇస్తామని ప్రకటించిన ఆనాటి పాలకులు నేటికీ దానిని అమలు చేయలేదని మండిపడ్డారు. మళ్లీ పుష్కరాలు రాబోతున్నా ఆనాడు ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేర్చలేకపోయారని విమర్శించారు. అప్పట్లో సీపీఎం వత్తిడి మేరకు తాత్కాలికంగా 45 గజాల స్థలం ఇచ్చి సరిపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, ఎస్. గిరిజ, కె. మేరి, స్థానిక మహిళలు రోజా, సోమేశ్వరి, దుర్గ, రమాదేవి, మేరి, మల్లీశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పలకలూరు రోడ్డు వద్ద మృతదేహం లభ్యం



మృతుడు గోవిందురాజులు

మేడికొండూరు: పలకలూరు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పేరేచర్ల పలకలూరు రోడ్డు వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు పలకలూరు గ్రామానికి చెందిన చెన్నంశెట్టి గోవిందురాజులు (40)గా గుర్తించారు. గోవిందురాజులు గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, తర్వాత చూకీ తెలియలేదని మృతుడి తండ్రి పోలీసులకు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయనకు ఎవరితోనూ గొడవలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం పోలీసులు అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉండవల్లి సెంటర్ పార్కులో స్వచ్ఛ భారత్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఫ్రైడే – డ్రైడేలో భాగంగా ఉండవల్లి సెంటర్ దొంతిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పార్కులో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం శానిటరీ సెక్రటరీ ఎస్కే గౌసియా మాట్లాడుతూ ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా సూచనల మేరకు ఉండవల్లి సెంటర్ పార్కులో వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులతో పాటు మెప్మా సిబ్బంది, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్లు

మంగళగిరి టౌన్: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 విధానంతో ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు అసౌకర్యం, ఇబ్బంది కలుగుతోందని వారు ఆందోళన బాట పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ చేసి ఆందోళనకు దిగారు. ఇందులో భాగంగా మంగళగిరి రిజిస్ట్రేషన్ కార్యాలయ దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. ఈ సందర్భంగా పలువురు దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ఆటోమ్యూటేషన్ సిస్టమ్‌ను తాము స్వాగతిస్తున్నా, డిపార్ట్‌మెంట్‌లో సమన్వయ లోపం వల్ల చాలా ఇబ్బందులు అనివార్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల పాటు పెన్‌డౌన్ జరుగుతుందని తెలిపారు. అనంతరం తమ డిమాండ్లతో సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మంగళగిరి దస్తావేజు లేఖరుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 2025 నుంచి 2027 వరకు రెండు సంవత్సరాలకు ఈ కార్యవర్గం ఉంటుందని నూతన కార్యవర్గ అధ్యక్షుడు యద్దనపూడి శివయ్య పేర్కొన్నారు. గౌరవ సలహాదారుగా కుక్కమళ్ల జయరాజు, ఉపాధ్యక్షులుగా మక్కెన సుధీర్‌బాబు, పగిడి ప్రభుదాస్, ధనుంజయరావు, ప్రధాన కార్యదర్శి పుల్లా కృష్ణ, కార్యదర్శులుగా తిరుమలశెట్టి చరణ్, తోలేటి ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా వంగా వెంకటరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా షేక్ మస్తాన్, వెంకట రాజేష్, సుందరరావు, కూరాకుల బాజీ, మంద్రు నారాయణ ఎంపికయ్యారు.

పర్యావరణ హిత ఆవిష్కరణలతో ఆరోగ్యం



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శన

నీరుకొండ(మంగళగిరి): ఆరోగ్యకర, సుస్థిరమైన వాతావరణాన్ని భావితరాలకు అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ హిత ఆవిష్కరణలకు శ్రమించాలని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.సతీష్‌కుమార్ తెలిపారు. నీరుకొండలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం పర్యావరణ ఎగ్జిబిషన్ నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎగ్జిబిషన్ ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ అభివృద్ధిని కాంక్షిస్తూ పర్యావరణాన్ని దెబ్బతీయడం శ్రేయస్కరం కాదన్నారు. సిక్కిం, భూటాన్ వంటి ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ నూరు శాతం అమలవుతుందని, ఆ దిశగా రాష్ట్రం ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సీవీ టామి, సలహాదారు డాక్టర్ సీవీ రావు, డాక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల విద్యార్థులు తయారు చేసిన ఎయిర్ సొల్యూషన్ ప్రాజెక్టు, మెదక్ జిల్లా జహీరాబాద్ వాక్సెన్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రదర్శించిన యూవీ లైట్ ప్రాజెక్టులు ఆకట్టుకోగా 44 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

మంగళగిరి టౌన్: శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు మురుగుడు హనుమంతరావు పేర్కొన్నారు. మంగళగిరి పరిధిలోని ఆయన నివాసంలో శుక్రవారం సొసైటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ సొసైటీ 42 సంవత్సరాలుగా ఇంటర్మీడియెట్ నుంచి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే చేనేత వర్గానికి చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు, ఇతర ఉపకరణాలు అందజేస్తున్నామన్నారు. అవసరమైన విద్యార్థినీవిద్యార్థులు ఈనెల 21వ తేదీ ఆదివారం షరాఫ్ బజార్‌లోని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో దరఖాస్తు పొంది, అవసరమైన పత్రాలు జతచేసి వారం రోజులలోపు తిరిగి అందజేయాలని తెలిపారు. సమావేశంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ గంజి రవీంద్రనాథ్, కార్యదర్శి ప్రగడ రాజశేఖర్, ట్రెజరర్ తిరువీధుల రమణమూర్తి, గౌరవ అధ్యక్షులు జొన్నాదుల బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి



కార్మికులకు మద్దతు తెలుపుతున్న నేతలు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు ఆదినారాయణ, సూర్యప్రకాష్, ఆశీర్వాదం, యెమోషువాలతో కలసి ప్రారంభించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ తీరు చూస్తుంటే కార్మికులకు న్యాయం చేసే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారని, వాటిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు శారద, నవనీతం, రమణ, రిబ్కా, సువర్ణకుమారి, దుర్గాభవాని, శివకుమారి, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు గండాలయ ఘాట్ రోడ్ మూసివేత

మంగళగిరి టౌన్: శ్రీ గండభేరుండ జ్వాలా లక్ష్మీ నరసింహస్వామి(శ్రీ గండాలయ స్వామి) గండదీపానికి వెళ్లే ఘాట్ రోడ్ మార్గాన్ని ఆదివారం నిలిపివేయనున్నట్లు దేవస్థాన సహాయ కమిషనర్ సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమావాస్య సందర్భంగా భక్తులు గండాలయ స్వామిని దర్శించుకునేందుకు ఘాట్‌రోడ్‌మీదుగా వస్తారని, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగి రోడ్డుపై అడ్డంగా ఉండడంతో ఆ రోడ్డుమార్గాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. భక్తులు మెట్లమార్గంలో రావాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

దుగ్గిరాల: చిలువూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం పలుగ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని కరెంట్ ఏఈ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంఠంరాజుకొండూరు, మంచికలపూడి గ్రామాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఫిరంగిపురం: మండల పరిధిలోని అల్లంవారిపాలెం, వసంతనగర్, ఆరోగ్యనగర్, జగనన్న కాలనీ 1,2,3,4 ప్రాంతాల్లో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

పొంగుతున్న వాగులు వంకలు

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో వరుస వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గురువారం రాత్రి లాం వద్ద కొండవీటి వాగుకు వరద ఉప్పొంగడంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. కంతేరు ఎర్రవాగు, పెదపరిమి కోటేళ్ళ వాగులు పొంగడంతో శుక్రవారం ఏపీ సచివాలయం, హైకోర్టుకు వెళుతున్న అధికారులు, సామాన్యుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.

రోగి ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం

మంగళగిరి: ఆరోగ్య సంరక్షణ సంస్థల్లో రోగి భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి, సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. నగర పరిధిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో శుక్రవారం ఆరోగ్య సంరక్షణ సంస్థల్లో రోగి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం అనే అంశంపై నిర్వహించిన జాతీయ సమావేశాన్ని కేంద్ర సహాయ మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో భారత దేశ ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ సుజాత చౌదరి పాల్గొన్నారు.

తుళ్ళూరు సీఆర్డీయే గ్రీవెన్స్‌లో 28 ఫిర్యాదులు

తాడికొండ: సమస్యల పరిష్కారం కోరుతూ తుళ్లూరు సీఆర్డీయేలో ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో మొత్తం 28 మంది రైతులు, రైతు కూలీలు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రాజధాని ప్రాంత వాసులు, రైతులు, కూలీలు అర్జీలను తమ ప్రాంత కాంపిటెంట్ అథారిటీ అధికారులైన సీఆర్డీయే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు అందజేశారు. గ్రీవెన్స్ డేలో మొత్తం 28 ఫిర్యాదులు రాగా వాటిలో అమరావతిలో భూమి వ్యవహారాలకు సంబంధించి 23, డెవలప్మెంట్ ప్రమోషన్ 3 జాతీయ రహదారులు 2 చొప్పున అర్జీలు అందాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి. శ్రీనివాస నాయక్, జి. రవీందర్, జి. భీమారావు, ఎం.శేషిరెడ్డి, ఏ.జి.చిన్నికృష్ణ, పి.పద్మావతి, కె.ఎస్.భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.